క్లుప్తంగా

అంగన్‌వాడీలో నాణ్యమైన భోజనం అందించాలి



అంగన్‌వాడీలో బియ్యం పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట: అంగన్‌వాడీలో నాణ్యమైన భోజనం అందజేయాలని ఎంపీడీఓ వెంకన్నగౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బుర్రితండా, కాకర్లగండి తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వంట సరుకులు, బియ్యం, పప్పు, కూరగాయలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెంకన్నగౌడ్ పేర్కొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

మండల విద్యాధికారి గోపాల్, అధ్యక్షుడు దశరథ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పరిగి: టీఎస్‌యూటీఎఫ్ నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి గోపాల్, మండల అధ్యక్షుడు దశరథ్ పేర్కొన్నారు. ఈ నెల 14న పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న మహాసభల వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించి విద్యా అభివృద్ధికి సంఘం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు బాధాకరం

బహుజన ముక్తిపార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్



మాట్లాడుతున్న గట్యానాయక్

పరిగి: ప్రభుత్వం లగచర్ల రైతులపై ప్రవర్తించిన తీరు బాధాకరమని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండె పోటు వచ్చిన రైతుకు ఉగ్రవాదిలా పోలీస్ వాహనంలో బేడీలు వేసి తీసుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ భూమిని కాపాడుకునేందుకు పోరాటం చేస్తే వారిపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. వచ్చే ఎన్నికల్లో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్, బీఎంపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాయక్, రవీందర్, బాబ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



దున్నపోతుల విన్యాసంలో యాదవసంఘం నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్‌లో సదర్ ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా దున్నపోతులతో విన్యాసాలు నిర్వహించి ఊరేగింపు చేపట్టారు. ఆంజనేయ స్వామిదేవాలయం ఎదుట నిర్వహించిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. డీజే పాటలకు యువకులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్, కొడంగల్, దుద్యాల్, కుదురుమల్ల గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అనంతగిరి: ఏబీవీపీ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను వికారాబాద్‌లోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో గురువారం జిల్లా కన్వీనర్ హరీష్ రావు విడుదల చేశారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో సిద్దిపేటలో ఈ సభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేశ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని లింకురోడ్లు

- ఏళ్లు గడుస్తున్నా నిధుల మంజూరుకు మోక్షం కరువు
- పట్టించుకోని అధికారులు
- రోడ్లు వేస్తే తగ్గనున్న దూరభారం



ఈర్లపల్లి-గోకఫసల్‌వాద్ మధ్య ఉన్న మట్టిరోడ్డు

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన లింకురోడ్లు అభివృద్ధికి నోచుకోవడంలేదు. గ్రామాల మధ్య దూరభారం తగ్గించడానికి ప్రారంభించిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో గ్రామానికి, గ్రామానికి మధ్య అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశారు. రోడ్ల అభివృద్ధి జరగకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల పలు రోడ్లను అభివృద్ధి చేసినప్పటికీ ఇంకా చేయాల్సిన పనులు పెండింగ్‌లోనే ఎక్కువగా ఉన్నాయి.

ఇవీ లింక్ రోడ్లు..

- ఈర్లపల్లి-గోకఫసల్‌వాద్ గ్రామాల మధ్య దౌల్తాబాద్ మీదుగా సుమారు 13కిలో మీటర్లు ఉంటుంది. పొలాల గుండా వేసిన రోడ్డు కేవలం 5కిలో మీటర్ దూరం ఉంటుంది. దీనిని తారురోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.
- ఊరగుంట-ఇండాపూర్ మధ్య రోడ్డును తారు రోడ్డుగా మారిస్తే సుమారు 8 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది.
- బిచ్చాల-అంతారం రోడ్డును బాగు చేసి తారు రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
- సురాయిపల్లి-ఊరగుంట రోడ్డు మధ్య బ్రిడ్జి నిర్మించి బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు పేర్కొన్నారు.
- బండివాడ-తిమ్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య రోడ్డును తారురోడ్డుగా మారిస్తే దూరభారం తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు.
- దౌల్తాబాద్ నుంచి కొడీడ్ గ్రామం వరకు, లింగయ్యబావి నుంచి ఉన్న రోడ్డును తారురోడ్డుగా చేస్తే దూరభారం 3కిలో మీటర్లు తగ్గుతుంది.

ఉచిత వైద్య సేవలతో పేదలకు మేలు



వైద్య సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ జయరాజు

దోమ: ఉచిత వైద్య సేవలతో పేదలకు మేలు కలుగుతుందని నెజరేత్ కాంపాసెషన్ మినిస్ట్రీస్ ఫౌండర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఉచిత వైద్య సేవలు డాక్టర్ జయరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలు ఆరోగ్యంగా ఉండడమే తమ లక్ష్యమన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, కళ్ల అద్దాలను అందిస్తున్నామన్నారు. కిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన క్యాంపునకు గ్రామస్తులు 325 మంది హాజరయ్యారు. అందులో 70 మందికి కళ్ల అద్దాలు, 45 మందికి ఎక్స్‌రే, ఈసీజీ 60 మందికి, రక్త పరీక్షలు 80 మందికి నిర్వహించి మందులు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నెజరేత్ కాంపాసెషన్ మినిస్ట్రీస్ బోర్డు మెంబర్ మైపాల్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం సంక్షేమానికి కృషి



కురుమసంఘం నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరిస్తున్న ధనసిరి ప్రకాశ్

సెఫర్డ్ ఇండియా రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనసిరి ప్రకాశ్

అనంతగిరి: కురుమ సంఘం సంక్షేమానికి కృషి చేయాలని సెఫర్డ్ ఇండియా రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనసిరి ప్రకాశ్ పేర్కొన్నారు. కోకాపేట్‌లో నిర్మించిన కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ గెస్ట్ హౌస్‌లో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 14న దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ సభ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని, ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాష్ట్ర ఎమ్మెల్సీ కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కురుమలంతా కలిసికట్టుగా సాగాలన్నారు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, వికారాబాద్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, జిల్లా నాయకులు గోపాల్, ప్యాట నర్సింలు, గొరిగే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



దౌల్తాబాద్: అభిషేకం చేయిస్తున్న పూజారి

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని మాజీసర్పంచ్ విజయ్‌కుమార్ ఇంట్లో గురువారం తాండూరుకు చెందిన జగదీశ్ పురోహితుడు ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, కలశపూజతో పాటు పడి వెలిగించారు. పూజా కార్యక్రమానికి మండలంలోని కుదురుమళ్ల, కోస్గి, మద్దూరు, కొడంగల్ నుంచి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పస్వాములకు అన్నదానం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనంతగిరిలో..

అనంతగిరి: మదన్‌పల్లి గ్రామ సమీపంలోని సంగమేశ్వర దేవాలయంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రవిపంతులు గురుస్వామి ఆధ్వర్యంలో భజన పాటలు ఆలపించారు. అనంతరం 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి దీపారాధాన చేశారు.

మెరుగైన బోధనే లక్ష్యం

మండల ప్రత్యేకాధికారి హన్మంతురావు



మాట్లాడుతున్న హన్మంతురావు

దోమ: మెరుగైన బోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి హన్మంతురావు సూచించారు. గురువారం ఉదన్‌రావుపల్లితో పాటు దోమ బాలికల పాఠశాలను ఎంపీడీఓ మహేశ్‌బాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలంటే ఉపాధ్యాయుల చొరవ ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొదన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ డానియల్

బంట్వారం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డానియల్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై నాయకులతో చర్చించారు. పోలింగ్ స్టేషన్ల ఫైనల్ పబ్లికేషన్స్‌పై సమావేశంలో చర్చించి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, సుందరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లొంక క్షేత్రం జాతర

పరిగి: లొంక ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న గణపతిపూజ, కలశస్థాన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 14న శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం, సత్సంగ ప్రవచనములు, 15న రథోత్సవం, అంబభవానీ బోనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాతుర్మాస ముగింపు సందర్భంగా శివలింగానికి పంచామృతాభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, దూపం, దీపం నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. స్వామివారికి మంగళహారతి ఇచ్చిన అనంతరం ఏర్పాటుచేసిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో..

దుద్యాల్: ఆలేడ్ గ్రామ శివారులోని ఆంజనేయ స్వామికి గురువారం నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

పూడూరు: మండల పరిధిలోని చీలాపూర్‌లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం అగ్నిగుడం, మధ్యాహ్నం కల్యాణం కనుల పండువగా జరుపుకున్నారు. వీరభద్ర భజన మండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

చేవెళ్ల: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామా ల వారీగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల వారీగా ఓటర్ల ప్రకారం కావాల్సిన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 330 వార్డులకుగాను 337 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల వారీగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వేశామని, ఏమైనా మార్పులు చేర్పులకు గురువారం వరకు అవకాశం కల్పించామన్నారు. దాదాపు మండలంలో పాతవాటినే కొనసాగిస్తున్నట్లు కొత్తగా 8 పోలింగ్ స్టేషన్లు పెరిగాయని తెలిపారు. ఈ విషయాలను అన్ని పార్టీల నాయకులకు తెలియజేసేందుకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే చెప్పాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన తుది నివేదిక విడుదలవుతుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలను ఒక్కొక్కటిగా పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల ప్రక్రియకు అన్ని పార్టీల నుంచి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సూపరింటెండెంట్ రవీందర్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు ప్రభాకర్, కృష్ణాగౌడ్, రామస్వామి, నరహరిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్‌లో కుటుంబ సర్వే పూర్తి

వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



కుంటుంబ వివరాలు నమోదుచేయిస్తున్న మంజుల

అనంతగిరి: సమగ్ర కుటుంబ సర్వే మున్సిపల్ పరిధిలో దాదాపుగా పూర్తయిందని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల పేర్కొన్నారు. గురువారం సమగ్ర సర్వేలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ సిబ్బంది చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుల తమ కుటుంబ వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సర్వే వికారాబాద్ మున్సిపల్‌లో దాదాపు 95% పూర్తయిందన్నారు. కొందరు ఇండ్లల్లో లేరని, కొన్నిటికి తాళం ఉందని, అందుబాటులో లేని వారు తప్పకుండా సర్వే చేయించుకోవాలని, ఎన్యుమరేటర్లకు సహకరించాలని తెలిపారు. ఈ సర్వేతో భవిష్యత్‌లో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు పేద లబ్ధిదారులకు చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అనిల్, ఆర్వో కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసు, పట్టణ సమన్వయ అధికారి వెంకటేశ్, ఆర్‌ఐ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ప్రీతిక, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు ముకుంద, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా భవనం మంజూరు చేయండి



మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో చంద్రశేఖర్‌గౌడ్

వీఓఏ చంద్రశేఖర్‌గౌడ్

దోమ: మహిళా సంఘాల నిర్వహణకు మండల కేంద్రంలో డ్వాక్రా భవనం మంజూరు చేయాలని వీఓఏ చంద్రశేఖర్‌గౌడ్ అధికారులను కోరారు. గురువారం దోమ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో డ్వాక్రా సంఘం మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్వాక్రా మహిళలు అద్దే భవనంలో సమావేశం నిర్వహించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కోసారి అద్దేభవనాలు దొరకకపోవడంతో గ్రామ పంచాయతీ వరండాలోనే మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క మండల కేంద్రంలోనే నలుగురు వీఓఏలు ఉండగా అందులో నాలుగు గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఒక్కో వీఓఏకు 125 మహిళా సంఘాలు ఉండడంతో నిత్యం సమావేశాలు, సంఘాల బలోపేతం, ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న రుణాలపై చర్చించేందుకు నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో డ్వాక్రా భవనం నిర్మిస్తే సంఘాల సభ్యులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు.

ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

- మండల ప్రత్యేకాధికారి సదానందం
- నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న సదానందం

మోమిన్‌పేట: ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని మండల ప్రత్యేకాధికారి సదానందం పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరునకు పేద లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శుక్రవారం నుంచి ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలిస్తారన్నారు. వాటిని పరిశీలించేక్రమంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించొద్దన్నారు. గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల సూచనలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితిలో రాజకీయాలకు తలొగ్గొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్



కుల్కచర్ల: క్రీడాకారులతో అధికారులు, నేతలు

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటమలు సహజమని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సీఎం కప్ మండల స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందడంతో పాటు శారీర కదారుఢ్యం, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పీఈటీ షబ్బీర్, రవీందర్, ప్రతాప్‌రెడ్డి, కరుణాకర్, కిష్టయ్య, నరేశ్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ఆరా..

వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి గ్రామంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్లో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. గురువారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, కాంగ్రెస్ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనందం, కోట్ల మైపాల్ రెడ్డి, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, పీఈటీలు ప్రవీణ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైనచర్య



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

అనంతగిరి: న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు దాడి చేయడం హేయమైనచర్యనని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం జర్నలిస్టులతో కలిసి జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలని వారు పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వైద్యనాథ్, గిరీష్‌స్వామి, రఘు, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ కృష్ణయ్యకు సన్మానం



ఆర్ కృష్ణయ్యను సత్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఏపీ నుంచి బీజేపీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గురువారం షాద్‌నగర్ బీసీ సేన నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ బీసీ సేన నాయకులు హైదరాబాద్‌లోని ఆర్.కృష్ణయ్య నివాసానికి వెళ్లిశాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, నాయకులు నరేశ్, నర్సింహాచారి, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, రాఘవేందర్‌చారి,రాంచందర్, కుమ్మరి కృష్ణ పాల్గొన్నారు.